సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం | 25 | సెప్టెంబర్ | 2023



మహిళ దారుణ హత్య

కడపలో మహిళ దారుణ హత్యకు గురైంది. ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తే చంపేశాడు.

-8లో..



వెల్లివిరిసిన మత సామరస్యం

వినాయకుడి లడ్డూలను వేలం పాటలో ముస్లిం యువకులు దక్కించుకుని హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు.

-8లో..

గరిష్టం/కనిష్టం
34.0/28.6

వాతావరణం

జిల్లాలో ఆదివారం 28.6 – 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

శిల్పారామంలో పర్యాటక ప్రాంతాల షో

కడప కల్చరల్: ఈ నెల 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప శిల్పారామంలో జిల్లా పర్యాటక ప్రాంతాల ప్రత్యేక షోను నిర్వహించారు. ఆశారేఖ ఫౌండేషన్ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి రూపొందించిన ఈ ప్రదర్శనను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిల్పారామం సందర్శకులకు ప్రదర్శించారు. ఇందులో జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు, ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, జిల్లా ప్రముఖులు, చరిత్ర, శాసనాలు, నదులు, ఇతర విశేషాలతో కూడిన ఫొటోలు, వాటి గురించిన వివరాలను తెలియజేశారు. కార్యక్రమాన్ని శిల్పారామం రాష్ట్ర ఏఓ మునిరాజు, కడప శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

హాకీ మైదానం పరిశీలన



హాకీ మైదానాన్ని పరిశీలిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, కార్యదర్శులు

పులివెందుల టౌన్: పట్టణంలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకీ క్రీడా మైదానాన్ని హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు, కార్యదర్శి హర్షవర్ధన్ పరిశీలించారు. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ 19వ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం స్థానిక విజయగార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే హాకీ పోటీల నిర్వహణ క్యాలెండర్లు, క్రీడా రిజిస్ట్రేషన్, కొత్త జిల్లాల ఎన్నికలు, వివిధ అంశాలపై బోర్డు సభ్యులతో చర్చించారు. అనంతరం క్రీడా మైదానాన్ని పరిశీలించి అంతర్జాతీయ హాకీ పోటీల నిర్వహణ, క్రీడాకారుల వసతి భవనాలను పరిశీలించి, ఈ నివేదికను హాకీ ఇండియా వారికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, కోశాధికారి థామస్, కడప సభ్యులు శ్రీనివాసులు, పులివెందుల శేఖర్, వివిధ జిల్లాల హాకీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు, పులివెందుల హాకీ పోషకులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్: కడప నగర పరిధిలోని శ్రీఅన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పురుషుల సీనియర్ విభాగం ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా బాస్కెట్‌బాల్ వ్యవస్థాపక కార్యదర్శి సి. శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే 9వ సీనియర్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వర్షం కారణంగా మహిళల జట్టు ఎంపికలను ఈనెల 25వ తేదీన కడప నగరంలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల శశికుమార్, ఫిజికల్ డైరెక్టర్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎకో టూరిజంతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా అటవీ శాఖాధికారి సందీప్‌రెడ్డి

కడప కల్చరల్ : జిల్లాలో ఎకో టూరిజం వల్ల మరింత ఆర్థికాభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయని జిల్లా అటవీ శాఖ అధికారి పీవీ సందీప్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంస్థల సహకారంతో ఆదివారం కడపలో ఎకో టూరిజంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సందీప్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 37 శాతానికి పైగా అటవీ ప్రాంతాలున్నాయని, అందులోని పలు ప్రాంతాలను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ మానస లయన్ కె. చిన్నపరెడ్డి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, విశ్రాంత ఇంజనీర్ దేసు వెంకట రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, జిల్లా పర్యాటక అభివృద్ధి సంస్థ సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఇంటాక్ సభ్యులు భారవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు.. రైతన్న నేస్తాలు

- అన్నదాతకు వెన్నుదన్నుగా రైతు భరోసా కేంద్రాలు
- విత్తు నుంచి విక్రయం దాకా అండగా..
- పండుగలా మారిన వ్యవసాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతాంగం



ఆర్‌బీకే ద్వారా ఎరువులను తీసుకెళ్తున్న రైతులు



కాశినాయన మండలం ఐత్రంపేటలోని రైతు భరోసా కేంద్రం

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతే రాజయ్యాడు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలందిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. దీంతో అన్నదాతలు ఆనందంగా జీవిస్తున్నారు.

ఉన్న ఊర్లోనే అన్ని సేవలు

రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయకముందు విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల కోసం మండల, నియోజకవర్గ కేంద్రానికో లేక జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. అలాగే రైతులు పండించిన ఉత్పత్తులను విక్రయించుకోవాలంటే ఉన్న ఊర్లో దళారులను, లేకుంటే దూర ప్రాంతంలో ఉన్న మిల్లుల వద్దకు వెళ్లాల్సి ఉండేది. కానీ రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తరువాత ఉన్న ఊర్లోనే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ ముందులు సైతం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే అందుతున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు కూడా రైతు భరోసా కేంద్రాల వద్దే జరుగుతోంది. ధాన్యాన్ని రైతు కళ్లాల వద్దకు వెళ్లి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. వీటితోపాటు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేపడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు అంచనా వేయడం కూడా రైతు భరోసా కేంద్రాల సిబ్బందే చేస్తున్నారు. పంటల సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలతోపాటు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకం వంటి సేవలు అందిస్తున్నారు. ఈ పనులన్నింటి కోసం వ్యవసాయ సహాయకులను ఏర్పాటు చేశారు. ఇలా రైతు భరోసా కేంద్రాలు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నాయి.


ఆర్‌బీకేల ద్వారా అందించే సేవలు

ఆర్‌బీకేల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

వైఎస్సార్ రైతు భరోసా నిధులు		వెచ్చించిన నిధులు
సంవత్సరం	రైతులు	(రూ.కోట్లలో)
2019–20	206708	279.93
2020–21	208747	280.06
2021–22	199344	269.11
2022–23	229013	287.50
2023–24	205600	155.00

	ఎరువులు	విత్తనాలు
సంవత్సరం	మెట్రిక్ టన్నులు	క్వింటాళ్లు
2021–22	1,42,802	65,857
2022–23	1,43,150	48,470
2023–24 (ఖరీఫ్)	14,950	10,668

- సబ్సిడీ విత్తనాల పంపిణీ
- సర్టిఫైడ్ హామీతో కూడిన ఇన్‌పుట్‌ల సరఫరా
- ఈ క్రాపు బుగింగ్‌కు రైతు డేటాబేస్ అప్‌లోడ్ చేయడం
- పంట సాగుదారుల హక్కు ధ్రువీకరణ పత్రం జారీ
- విత్తన సేకరణ కార్యకలాపాలు, ఎంఎస్‌పీ, మార్కెట్ ఇంటెలిజెన్స్, ఏపీఏక్యూ నిబంధనలపై సమాచారం అందించడం
- పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పంట రుణాల కోసం డేటా అప్‌లోడ్ చేయడం
- విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ ముందులు, పశువుల దాణా మొదలైన ముందుగా పరీక్షించిన నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్‌ల సరఫరా
- వివిధ పథకాల కింద లబ్ధిదారులందరి సామాజిక తనిఖీ, అంటే ప్రకృతి వైపరీత్యాలు, సబ్సిడీ విత్తనాలు మొదలైనవి
- డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్లు, వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించడం
- పొలంబడి, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, మినీకిట్ ట్రయల్ ప్లాట్లు మొదలైన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంల నిర్వహణ
- విత్తన పరీక్ష (భౌతిక స్వచ్ఛత, ఆకురోత్పత్తి పరీక్ష)
- రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడం, ఉత్తమ నిర్వహణ పద్ధతుల వ్యాప్తి, పొలంబడి, పద్ధతి ప్రదర్శనలు మొదలైనవి.
- స్మార్ట్ టీవీ(డిజిటల్ సిగ్నేజ్) క్రాపు నిపుణులచే సాంకేతిక సెషన్‌ల చిరునామాను ప్రత్యక్ష ప్రసారం చేయడం
- స్ప్రైయర్స్ వంటి చిన్న వ్యవసాయ పరికరాలను అద్దెకు తీసుకోవడం
- బీజామృతం మొదలైన సహజ, ఉత్పత్తులపై ప్రదర్శనలు నిర్వహించడం
- అన్ని ప్రభుత్వ పథకాలకు సేవా కేంద్రం
- రైతుల డేటాబేస్, నేల ప్రొఫైల్‌ను నిర్వహిస్తుంది
- జంతు ఆరోగ్యకార్డుల జారీ
- ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ: జంతువుల ప్రథమ చికిత్స
- ఈ- క్రాపు బుకింగ్ ద్వారా పశుగ్రాసం అవసరాన్ని లెక్కించడం



తప్పిన కష్టాలు



రైతు భరోసా కేంద్రాలు వచ్చాక రైతులకు కష్టాలు తగ్గాయి. గతంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న దశలో.. ఎరువులు, పురుగుల నివారణ మందుల కోసం మండల కేంద్రాలకు పరుగు తీయాల్సి వచ్చేంది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఊర్లో ఉండే రైతు భరోసా కేంద్రంలోనే అన్నీ తెచ్చుకుంటున్నాం.

– నాగేశ్వరరెడ్డి, రైతు, రావులపల్లె, ఖాజీపేట మండలం

ఏటా రైతు భరోసా



రైతు భరోసా కేంద్రం ద్వారా ఈ క్రాపును సకాలంలో బుకింగ్ చేస్తున్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు నష్టపరిహారం సకాలంలో అందుతుంది. దీంతోపాటు ప్రతి ఏటా నిర్దేశించిన సమయానికి రైతు భరోసా డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయి. దీంతో పంటల సాగు సమయంలో విత్తనాలు, ఎరువులకు డబ్బులతో సమస్య లేకుండా పోయింది. – వెలవలి బాలయ్య, రైతు, టంగుటూరు, రాజుపాళెం మండలం

సద్వినియోగం చేసుకోవాలి



రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పంటలసాగు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను తీసుకుని పంటలను సాగు చేసుకోవాలి. పంటలకు చీడపీడలను ఆశించినప్పుడు కూడా వారిని పొలం వద్దకు తీసుకెళ్లి చూపించుకుని వారి సలహా మేరకు పురుగు మందులను వాడుకోవాలి. వీటితోపాటు వ్యవసాయ పరంగా అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి, కడప

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీపీఎస్సీలోని వివిధ నోటిఫికేషన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకు, అలాగే అక్టోబరు 3 నుంచి 6వ తేదీ వరకు ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 8 నుంచి 9 వరకు, మధ్యాహ్న 1 నుంచి 2 వరకు మాత్రమే అనుమతించాలని సూచించారు. కోవిడ్ నిబంధనల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా చూడాలన్నారు. లైజన్ అధికారులు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పని చేసి సజావుగా సాగేలా చూడాలన్నారు. పోలీసులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు టీఎస్ రాజగోపాల్, పి.ధీలేశ్వర్, ఎం.అమ్మాజీ, ఆర్.సునీత, ఎస్.హరిబాబుతోపాటు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలు

కడప నగర పరిధిలో...

- అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, ఊటుకూరు, చింతకొమ్మదిన్నె మండలం
- శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల, ఉక్కాయపల్లె, కడప
- కేఓఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల, తాడిగొట్ల, చింతకొమ్మదిన్నె మండలం
- సాయి రాజేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, లింగాపురం, ప్రొద్దుటూరు మండలం

అన్ని వర్గాల ప్రజలకు అండగా ప్రభుత్వం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- ప్రజా సమస్యలపై ఆరా
- పరిష్కారానికి చర్యలు



ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె: అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కల్యాణ మండపంలో పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. జగనన్న భరోసా కార్యక్రమంలో భాగంగా వార్డుల వారీగా బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయా పరిధిల్లోని సమస్యలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అర్జీ రూపంలో కార్యకర్తలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజలు నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ముఖ్యంగా జగనన్న లేఅవుట్‌లోని మట్టిరోడ్లు వర్షానికి దెబ్బతిన్నాయంటూ ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తాగునీరు పైపులైన్‌లు దెబ్బతిన్నాయని, దీంతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వేంపల్లె పట్టణంలోని డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, పంటపొలాలకు సంబంధించి మట్టి రోడ్లు, ఇళ్లస్థలాలు, డీకేటీ పట్టాలు తదితర సమస్యలను పరిష్కరించాలని ఎంపీ అధికారులకు సూచించారు. పిల్లస్వామిగుట్ట వద్ద బొక్కలవంకపై పొలాలకు, జగనన్న లేఅవుట్‌కు మధ్య కల్వర్టు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి కోరారు. డయాలసిస్ కోసం వేంపల్లె నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాలంటే అసౌకర్యంగా ఉందని, కావున డయాలసిస్ కేంద్రాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పీటీసీ, ఏపీ పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ షబ్బీర్‌వలిలు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎంపీ పులివెందుల ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ చేసేందుకు సౌకర్యం ఉందని, వేంపల్లె వాసులకు ప్రత్యేకంగా ఒక క్యాంపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ కె.చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, విద్యుత్ డీఈఈ శ్రీకాంత్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటరమణ, సీఐ చాంద్‌బాషా, ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- చెన్నూరు, సిద్దవటం మండలాల్లో అతి భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కొన్ని చోట్ల రాకపోకలకు అంతరాయం
- తిప్పరాజుపల్లె వంకలో చిక్కుకున్న ఆరుగురిని కాపాడిన గ్రామస్తులు



కడపలోని గురుకుల విద్యాపీఠం రహదారిలో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్న ప్రజలు

కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో ఐదు రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కానీ కొన్ని మండలాల్లో తక్కువగా కురుస్తుంటే.. మరి కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. కానీ ఆదివారం తెల్లవారుజామున పలు మండలాల్లో దంచి కొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దాదాపు 3 గంటల సేపు ఏకధాటిగా కురిసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు పడిన వాటిలో ఇదే పెద్దదని చెప్పవచ్చు. చెన్నూరు, సిద్దవటం మండలాల్లో అతి భారీగా, కడప, ఖాజీపేట, చింతకొమ్మదిన్నెలో భారీగా కురిసింది. చెన్నూరు మండలంలో అత్యధికంగా 168.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిద్దవటం మండలంలో 160.8, కడప 98.2, ఖాజీపేట 92.6, చింతకొమ్మదిన్నె 90.2, పెండ్లిమర్రి 83.4, వల్లూరు 80.4, చక్రాయపేటలో 73 మి.మీ. నమోదైంది. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పెండ్లిమర్రి వద్ద కడప- పులివెందుల ప్రధాన రహదారి నుంచి తిప్పరాజుపల్లెకు వెళ్లే దారిలో ఉన్న వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో గ్రామం నుంచి ప్రజలు ఎటు పోలేక అవస్థలు పడ్డారు. ఈ వంకను దాటేందుకు ప్రయత్నించిన ఆరుగురు నీటిలో ఇరుక్కుపోయారు. వెంటనే స్థానికులు స్పందించి వారిని సురక్షితంగా కాపాడారు. ఖాజీపేట మండలంలోని వక్కిలేరు వంక ఉధృతంగా ప్రవహించింది. ఖాజీపేట నుంచి రావులపల్లెకు వెళ్లే దారిలో వరదనీరు భారీగా ప్రవహించడంతో రాకపోకలకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది. బ్రహ్మంగారిమఠం తెలుగుగంగ రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో పిడుగుపాటుకు ఒక గేదె మృతి చెందింది. మరికొన్ని చోట్ల పంట పొలాలు వర్షం నీటితో నిండిపోయాయి. కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల రోడ్లపైకి భారీగా నీరు చేరింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



కడప హౌసింగ్ బోర్డు కాలనీలోని వీధిలో నిలిచిన నీరు



లింగాల నుంచి బోనాలకు వెళ్లే రహదారిలో కోతకు గురైన కల్వర్టు



పెండ్లిమర్రి మండలం తిప్పరాజుపల్లె వద్ద వంకలో నిలిచిపోయిన ట్రాక్టర్, కూలీలు

మండలం - కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
చెన్నూరు	168.8	పోరుమామిళ్ల	21.2
సిద్దవటం	160.8	గోపవరం	20.8
కడప	98.2	వేముల	18.2
ఖాజీపేట	92.6	కాశినాయన	12.8
సీకేదిన్నె	90.2	ఒంటిమిట్ట	10.8
పెండ్లిమర్రి	83.4	చాపాడు	10.2
వల్లూరు	80.4	పులివెందుల	9.8
చక్రాయపేట	73	సింహాద్రిపురం	8.8
లింగాల	59.2	రాజుపాళెం	8.2
వేంపల్లె	50.6	తొండూరు	5.4
బి.మఠం	43.8	కలసపాడు	5.4
మైదుకూరు	40	అట్లూరు	5.2
కమలాపురం	38.2	ప్రొద్దుటూరు	4.2
బి.కోడూరు	32.2	జమ్మలమడుగు	4.2
దువ్వూరు	29.8	పెద్దముడియం	4
బద్వేలు	25.2	ఎర్రగుంట్ల	3

1న రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.జీవన్ చంద్రశేఖర్

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (అమరావతి) 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో జరగనుందని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.జీవన్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కడప నగరం పాత కలెక్టరేట్ వద్దగల రెవెన్యూ హోంలో నిర్వహించిన ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రత్యేక అతిథిగా సీసీఎల్‌ఏ సాయిప్రసాద్, ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి జిల్లాకు సంబంధించిన సభ్యులందరూ హాజరు కావాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈ నెల 30వ తేది రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్రయ కమిటీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. సమావేశంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి అలీఖాన్, కోశాధికారి రొనాల్డ్, తహసీల్దార్లు గంగయ్య, ఇక్బాల్‌బాషా, శంకర్, ఉదయభాస్కర్‌రాజు, శరత్, నరసింహాప్రసాద్, కుమార్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అశ్వవాహనంపై శ్రీరంగనాథుడు



అశ్వవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 6వ రోజు ఆదివారం శ్రీరంగనాథస్వామి సతీసమేతుడై అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉభయదారులచే పూజలు జరిపించారు. రంగనాథున్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై కాయ కర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలతోపాటు ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఇడుపులపాయ అడవుల్లో చిరుత సంచారం

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ సమీపంలో చిరుతపులి సంచరిస్తోంది. శనివారం రాత్రి చిరుతను గమనించిన హరిత రెస్టారెంట్ సిబ్బంది ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలం వద్దకు వెళ్లి ఆరా తీశారు. అలాగే చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు సూచనలు ఇచ్చి వచ్చారు. రాత్రి సమయంలో డ్యూటీ చేస్తున్న సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని రాజులగురువాయిపల్లె గ్రామానికి చెందిన భవాని అనే యువతి అదృశ్యమైనట్లు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ సమాచారం మేరకు ఈనెల 22వతేదీన ఉదయం 9గంటల సమయంలో భవాని రాజులగురువాయిపల్లెలోని ఇంటివద్ద నుంచి తిరుపతిలోని కళాశాలకు వెళ్లేందుకు మండలంలోని తిమ్మాపురం క్రాస్ వద్ద బస్సు ఎక్కింది. అయితే భవాని కళాశాలకు చేరలేదు. ఈ నేపథ్యంలో అమ్మాయి తల్లిదండ్రులు ఆమెకోసం పలువురిని విచారించారు. అయినా ఆచూకీ తెలియలేదు. దీంతో అమ్మాయి తండ్రి గంగాధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడపలో మహిళ దారుణ హత్య

- సహజీవనం చేసిన వ్యక్తే కాలయముడు
- సంఘటన జరిగిన 24 గంటల తరువాత వెలుగులోకి...
- పోలీసుల అదుపులో నిందితుడు



తాటిచెర్ల లక్ష్మి (ఫైల్)



లక్ష్మి మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న తాటిచెర్ల లక్ష్మి(45) అనే మహిళను ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తే కాలయముడిగా మారి రోకలిబండతో తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటన జరిగిన ఒకటిన్నర రోజు తరువాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నచౌక్ పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ముద్దనూరుకు చెందిన తాటిచెర్ల లక్ష్మికి, నారాయణ స్వామికి నవీన, సస్మిత అనే ఇద్దరు కుమార్తెలు సంతానం. నారాయణ స్వామి అనారోగ్యంతో కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయాడు. తాటిచెర్ల లక్ష్మి, తన ఇద్దరు కుమార్తెలకు మూడేళ్ల క్రితం ఒకరికి, తరువాత ఇటీవల రెండవ కుమార్తెకు వివాహం చేసింది. పెద్ద కుమార్తె వివాహం అయిపోగానే లక్ష్మి, కడపలోని ఎన్జీఓ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉండేది. ఈ క్రమంలో బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్న జమ్మలమడుగుకు చెందిన ఆవుల రామాంజనేయులుతో ఆమెకు పరిచయం పెరిగింది. అతనితో పాటు కూలిపనికి వెళుతూ, అతనితోనే సహజీవనం కొనసాగించింది. కొన్ని రోజుల నుంచి ఇద్దరు మనస్పర్థలతో గొడవపడేవారు. నిందితుడు ఆవుల రామాంజనేయులు ఎలాగైనా లక్ష్మి పీడ వదిలించుకోవాలని పథకం వేశాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి లక్ష్మి ఉంటున్న ఇంటికి వెళ్లి ఆమె నిద్రకు ఉపక్రమించిన సమయంలో రోకలిబండతో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఎవరికంటా పడకుండా పరారయ్యాడు. మరుసటి రోజు శనివారం రాత్రి చుట్టు పక్కల మహిళలు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్, హెడ్‌కానిస్టేబుల్ రామసుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది పరిశీలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. లక్ష్మి కుమార్తె నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కాగా లక్ష్మిని దారుణంగా హత్య చేసిన నిందితుడు ఆవుల రామాంజనేయులును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చిదానంద గౌడ్ మృతి



రాజంపేట : ఈడిగ కార్పొరేషన్ సంస్థ డైరెక్టర్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నేత, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి దాసరి చిదానందగౌడ్ (52) ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం ఈడిగపల్లెలోని స్వగృహానికి తరలించారు. గత కొద్దిరోజులుగా తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఆయన భౌతిక కాయానికి సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సంబంధీకులు తెలిపారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. పెద్దకుమార్తె దాసరి మౌనిక రాజంపేట మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా ఉన్నారు.

చిదానందగౌడ్ మృతి తీరని లోటు : మేడా, ఆకేపాటి

రాష్ట్ర బీసీ నాయకుడు చిదానందగౌడ్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటు అని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్‌చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కృష్ణారావు, రాజంపేట మండల జేసీఎస్ కన్వీనర్ గంగిరెడ్డి, ప్రాంతీయ వైద్యశాల డైరెక్టర్లు ఉమా, వడ్డె శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, నాయకులు మనుబోలు వెంకటసుబ్బయ్య, రామస్వామి రెడ్డి, మధుసూదనరెడ్డి, మురళీచారి, హిమగిరియాదవ్, మైనార్టీ నేత ఖాజా మొహిద్దీన్, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, పోలి వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌శెట్టి తదితరులు కూడా నివాళులర్పించారు.

ఆలయంలో చోరీ

నందలూరు (రాజంపేట): నందలూరు రైల్వేకేంద్రంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం గుండా తాళం విరగకొట్టి దొంగలు హుండీలో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం యథావిధిగా ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన పూజారి సరసా రవికుమార్ శర్మ ప్రధాన ద్వారంతోపాటు గర్భగుడి ద్వారాల తాళాలను విరగకొట్టిన విషయాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పక్కనే ఉన్న హజరత్ ఖాదర్ వలీ దర్గాలో దొంగలు హుండీలోని నగదును దోచుకెళ్లారు. ఈ విషయాన్ని దర్గా కమిటీ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జాకీర్ రెండు ఆలయాల పరిసరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



చిట్వేలి:లడ్డును తీసుకెళుతున్న జావిద్



లక్కిరెడ్డిపల్లిలో షేక్ పెద్దఖాదర్ వలికి లడ్డును అందజేస్తున్న సినీ హీరో పీలం భరత్ యాదవ్



రాయచోటి: రూ.2 లక్షలకు లడ్డు దక్కించుకున్న కొండూరు మనోహర్‌రాజు, తదితరులు



చిన్నమండెం: వద్ద రూ.2.50 లక్షలతో లడ్డును దక్కించుకున్న ఓర్సు రెడ్డెప్ప

చిట్వేలి/రాయచోటి: చిట్వేలిలోని వినాయకుడి మంటపం వద్ద ఉంచిన లడ్డుకు ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన వేలం పాటలో షేక్ జావిద్ రూ. 32 వేలకు వినాయకుని లడ్డును దక్కించుకొని హిందూ ముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలిచాడు. వినాయక చవితి సందర్భంగా స్థానిక సత్తెమ్మ వీధి యువకులు వైఎస్సార్ సర్కిల్ వద్ద మంటపం ఏర్పాటు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా లడ్డు వేలంపాట, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా షేక్ జావిద్ రూ. 32 వేలకు లడ్డును కైవసం చేసుకున్నాడు. చిట్వేలి మండలంలో అటు హిందూ పర్వదినాలు, ఇటు ముస్లిం పండుగలను ఐకమత్యంగా అందరూ కలిసి మెలిసి చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

లక్కిరెడ్డిపల్లి మండలంలో..

లక్కిరెడ్డిపల్లి మండలం, కాకులవారం గ్రామం, మునిరెడ్డిగారిపల్లిలో గణపతి లడ్డు వేలం పాటలో అదే గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు షేక్ పెద్దఖాదర్ వలీ రూ. 27వేలకు లడ్డును దక్కించుకున్నాడు. సినీ హీరో పీలం భరత్ యాదవ్ ఈ లడ్డును వలీకి అందజేశారు.

కాగా, రాయచోటి పట్టణంలోని శ్రీ వెన్నెస్ట్ విల్లాస్‌లో రూ. 2 లక్షల 2వేలకు కొండూరు మనోహర్ రాజు, మేఘ శ్యామ్‌లు వినాయకుని లడ్డును దక్కించుకున్నారు.

రూ.2.50 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ శ్రీనివాసపురంలో వినాయక ప్రతిమ వద్ద వేలం పాటలో ఓర్సు రెడ్డెప్ప రూ.2.50 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు.

వినాయక నిమజ్జనంలో విషాదం

పెన్నా నదిలో యువకుడి మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామ సమీపంలో ఉన్న పెన్నానదిలో నీటి గుంతలో పడి చిన్న (30) అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో గల రజక కాలనీకి చెందిన గంగులయ్య కుమారుడు చిన్న వినాయక నిమజ్జనానికి తోటి వారితో కలసి ఆదివారం రాత్రి పెన్నానదికి వచ్చాడు. విగ్రహం నిమజ్జనం అనంతరం స్నానం చేసేందుకు నదిలోకి దిగి గుంతలో పడి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళ్ల సుబ్బన్న కాలనీలో చోరీ

మదనపల్లె : పట్టణశివారు తాళ్లసుబ్బన్నకాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.5లక్షలు విలువచేసే నగలు, విలువైన వస్తువులు దొంగిలించుకుని వెళ్లిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. కొత్త ఇండ్లు పంచాయతీ తాళ్లసుబ్బన్నకాలనీకి చెందిన తాళ్ల హిమగిరి వ్యాపారరీత్యా బెంగళూరులో ఉంటున్నారు. ఆయన తండ్రి శ్రీనివాసులు మదనపల్లెలోని ఇంట్లో ఉంటున్నారు. మూడురోజుల క్రితం బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంట్లో మూడురోజులుగా ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి రూ.5లక్షలు విలువచేసే నగలు, వెండి వస్తువులను తీసుకెళ్లిపోయారు. ఆదివారం చుట్టుపక్కలవారు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి హిమగిరికి ఫోన్‌చేసి చెప్పడంతో బెంగళూరు నుంచి వచ్చి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నార్త్‌జోన్, నెల్లూరు జట్ల విజయం



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో తలపడుతున్న నెల్లూరు, సౌత్‌జోన్ జట్లు



62 పరుగులు చేసిన సౌత్‌జోన్ బ్యాట్స్‌మన్ ధరణికుమార్ నాయుడు



60 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ సుబ్రమణ్యం



4 వికెట్లు తీసిన సౌత్‌జోన్ బౌలర్ సంతోష్‌కుమార్



52 పరుగులు చేసిన నార్త్‌జోన్ బ్యాట్స్‌మన్ విజయ్

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో నార్త్‌జోన్, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సౌత్‌జోన్, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 40 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి సౌత్‌జోన్ జట్టు 216 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఇ. ధరణికుమార్ నాయుడు 62 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు సాకేత్ రామ్ 3, అఖిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 39.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని సుబ్రమణ్యం 60 పరుగులు, రోషన్ పవన్‌కుమార్ 40 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నార్త్‌జోన్ జట్టు విజయం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విజయనగరం, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విజయనగరం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. వర్షం కారణంగా ఓవర్లు కుదించగా నిర్ణీత 28 ఓవర్లలో విజయనగరం జట్టు 28 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. జట్టులోని దుర్గా కుమార్ 40 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు సాహిల్ హుస్సేన్ 2, వంశీనారాయణ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 27 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. జట్టులోని విజయ్ 52 పరుగులు, రాహుల్ 40 పరుగులు చేశాడు. దీంతో నార్త్‌జోన్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించాల్సిన సెంట్రల్ జోన్, కృష్ణ జట్ల మ్యాచ్ రద్దయింది.

కడప రూరల్ సర్కిల్ కార్యాలయంలో

కానిస్టేబుల్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదనే కారణం
- ఫిర్యాదులో పేర్కొన్న మృతుని భార్య భానుశ్రీ



విజయ్ రాముడు (ఫైల్)

చింతకొమ్మదిన్నె/కడప అర్బన్ : చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పైభాగాన ఉన్న కడప రూరల్ సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విజయ్ రాముడు (39)(పీసీ నంబర్:2876) ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భానుశ్రీ ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. 2011 బ్యాచ్‌కు చెందిన విజయ్‌రాముడు జిల్లాలోని పలు పోలీ స్టేషన్‌లలో పనిచేశాడు. కడపలోని అక్కాయపల్లిలో నివాసం ఉండేవాడు. చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై కడప రూరల్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో పని చేస్తుండగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ సమయంలో ఆర్థిక సమస్యలను ఎదుర్కొన్నాడు. తరువాత సస్పెన్షన్ ఎత్తివేయగా విధుల్లో చేరాడు. అంతేగాక అతని తండ్రి అయోధ్యరాముడు తాను సంపాదించిన స్థిరాస్తులను తన కుమారుడికి ఇవ్వకుండా, కుమార్తెలకే ఇచ్చాడు. తద్వారా కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడి, తీవ్ర మానసిక ఆవేదనకు గురయ్యాడు. ఇతనికి భార్య భానుశ్రీ, కుమారుడు హర్షిత్ ఉన్నారు. ఆర్థిక సమస్యలు, మానసిక వేదనతో ఈ చర్యకు పాల్పడ్డాడని మృతుని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన శనివారం సాయంత్రం సెల్‌ఫోన్, పర్సు, తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను అన్నీ ఇంట్లోనే ఉంచేసి విధులకు వెళ్లిపోయాడు. ఉదయం ఎంతసేపటికి ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ ఇంటిలోనే ఉంచి వెళ్లిపోవడంతో అతని భార్య హుటాహుటిన తన భర్త పనిచేస్తున్న కడప రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ ఓ మూలన ఉన్న గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి వేలాడుతున్నాడు. అతని భార్య బోరున విలపిస్తూ పోలీస్‌స్టేషన్ వారి సహకారంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాని అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతకొమ్మదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఎంపీ అవినాష్ రెడ్డి చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న భానుప్రసాద్

పెనగలూరు: ఓబిలి హరిజనవాడకు చెందిన భాను ప్రసాద్ అనే బాలుడికి లక్ష రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం అందజేశారు. పెనగలూరు మండలం, ఓబిలి హరిజనవాడకు చెందిన కాల్వ భానుప్రసాద్‌కు రెండు కిడ్నీలు పాడై తిరుపతిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు.

ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి పులివెందులకు వచ్చిన సందర్భంగా భాను ప్రసాద్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ విషయంపై కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు కూడా సీఎంకు విన్నవించారు. దీంతో లక్ష రూపాయలు మంజూరు చేయడంతో వేంపల్లి టీటీడీ కల్యాణ మండపంలో ఎంపీ చెక్కును బాధితుని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో తిప్పన నాగభూషణం, బాధితుని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మామపై అల్లుడు కత్తితో దాడి



క్షతగాత్రుడు రామ్మోహన్‌ను పరిశీలిస్తున్న సీఐ చాంద్‌బాషా

వేంపల్లె : స్థానిక పుల్లయ్యతోటలో నివాసముంటున్న తమ్మిశెట్టి రామ్మోహన్‌పై అల్లుడు వీరాంజనేయులు కత్తితో దాడి చేశాడు. ఆదివారం రామ్మోహన్ భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామ్మోహన్ దగ్గర పని చేసే బేల్దారితో వీరాంజనేయులు చెల్లెలు వెళ్లిపోయింది. తన మామ రామ్మోహనే వారిద్దరిని జతచేసి పంపించాడని వీరాంజనేయులుకు అనుమానం. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం రామ్మోహన్‌పై అల్లుడు వీరాంజనేయులు కత్తితో దాడికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి బాధితుడిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ చాంద్ బాషా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రుడిని పరిశీలించి, దాడికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్చికి తాళాలు.. పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చిన సంఘ పెద్దలు, పాస్టర్

జమ్మలమడుగు: మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో చర్చికి తాళాలు వేయడం వివాదాస్పదంగా మారింది. ఆదివారం మండల పరిధిలోని రాజీవ్‌నగర్ సమీపంలో ఉన్న సియోను ప్రార్థన మందిరానికి పాస్టర్ గండ్లూరు జోయల్ భక్త విజయం, భక్తులు ప్రార్థనలు చేసుకునేందుకు వచ్చారు. అయితే అప్పటికే చర్చి గేటుకు తాళాలు వేసి ఉండటంతో సంఘ పెద్దలు, పాస్టరు పట్టణంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను చర్చిలో ప్రార్థనలు చేసుకోకుండా కొంత మంది అడ్డుకుంటున్నారన్నారు. విచారించి తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో సంఘ పెద్దలు మార్కు, కుందవరపు పుష్పరాజ్, మహిళలు ఉన్నారు.

వైఎస్సార్ బీమా మంజూరు



వైఎస్సార్ బీమా ఉత్తర్వు పత్రాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటకు చెందిన పఠాన్ గౌస్‌ఖాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. దీంతో వైఎస్సార్ బీమా కింద రూ.5లక్షలు నిధులు మంజూరు ఉత్తర్వులను ఆదివారం బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అందజేశారు. బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ హైదర్‌వలీ, గౌస్‌మొహిద్దీన్, సర్పంచ్ అయూబ్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా జగ్గారి వెంకటసుబ్బయ్య



కడప ఎడ్యుకేషన్ : పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా జగ్గారి వెంకటసుబ్బయ్యను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, వైష్ణవ కరుణానిధిమూర్తి తెలిపారు. జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ తర్వాతి కౌన్సిల్ సమావేశం జరిగే వరకు వెంకటసుబ్బయ్య అధ్యక్షుడిగా కొనసాగుతారన్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెంకటరమణ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ఉంటారన్నారు.

అదుపు తప్పిన కారు

సంబేపల్లి : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం కారు బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్ ఎస్.జశ్వంత్‌కు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు రాయచోటికి చెందిన జశ్వంత్ కారులో కలకడకు వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనం ఒక్కసారిగా కారు వైపు దూసుకువచ్చింది. దీంతో వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొనగా డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.